క్లుప్తంగా

కృష్ణమనాయుని గుంటకు పూర్వవైభవం

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీ, కార్పొరేషన్ జనరల్ ఫండ్, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత పేర్కొన్నారు. స్థానిక కృష్ణమనాయుని కుంట పనులను, చెన్నారెడ్డి కాలనీ–ఇస్కాన్ రోడ్డును కలుపుతూ నిర్మిస్తున్న లింక్ రోడ్డు, జబ్బార్ లే అవుట్ లింక్ రోడ్డు పనులను శనివారం కమిషనర్ హరిత అధికారులతో కలిసి పరిశీలించారు. కృష్ణమనాయుని కుంట ఆధునికీకరణ పనులను నవంబర్ 15వ తేదీలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కృష్ణయనాయుని గుంటకు కొత్త రూపు తీసుకొచ్చామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి దృష్టికి ఈ కుంట దుస్థితిని ప్రజలు తీసుకువచ్చారన్నారు. ఈ చారిత్రక కట్టడం పరిరక్షణను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎమ్మెల్యే అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, డీఈ శ్రావణి పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ చక్రవర్తి, డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబులు

తిరుపతి మంగళం: కపిలతీర్థం వద్ద ఉన్న టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో శనివారం వాల్మీకి జయంతి వేడుకలను టాస్క్‌ఫోర్స్ ఎస్పీ కె.చక్రవర్తి ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పక్షులను వేటాడే వ్యక్తి రుషిగా మారాడని ఆయన తెలిపారు. ఆదికావ్యమైన రామాయణాన్ని రచించిన గొప్ప వ్యక్తి వాల్మీకి అని కొనియాడారు. టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు, సీఐ శ్రీనివాసులు, ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ మోహన్‌నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

హోమ్ ప్రొడక్ట్స్ ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శన ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: టర్నీకి ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఎయిర్ బైపాస్ రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఫర్నిచర్ గార్మెంట్స్ అండ్ హోమ్ ప్రొడక్ట్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణ విద్యాసంస్థల జీఎం కొండలరావు, టర్నీకీ ఈవెంట్స్ సీఈవో రాధాకృష్ణన్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఎగ్జిబిషన్‌ను ఆరంభించారు. ఈ సందర్భంగా ఈవెంట్స్ సీఈవో రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్ నవంబర్ 5వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎగ్జిబిషన్‌లో ఫర్నిచర్, ఫర్నిషింగ్, హోమ్ ఇంటీరియర్ ప్రొడక్ట్స్, దుస్తులు, జువెలరీస్, కిచెన్ అప్లయిస్, హెల్త్ అండ్ బ్యూటీప్రొడక్ట్స్, ఫుడ్ ప్రొడక్ట్స్ వినియోగదారులకు అవసరమైన అనేక వస్తువులు అందుబాటులో ఉంచామని తెలిపారు.

సెల్వంకు బీసీ ఉద్యోగుల సత్కారం



సెల్వంను అభినందిస్తున్న టీటీడీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: టీటీడీ ఉప కార్యనిర్వహణాధికారి సెల్వంను టీటీడీ బీసీ లైజన్ ఆఫీసర్‌గా నియమిస్తూ టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు టీటీడీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు సెల్వంను కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. టీటీడీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి గంగరాజ్ కుమార్ యాదవ్, కోశాధికారి ఏ.కామరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రప్ప, సూపరింటెండెంట్‌లు దయాకర్, రూపేంద్ర, యువరాజు, మునేంద్ర, సాయికుమార రఘుపతి, శంకరయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మీపతి, సభ్యులు ఉన్నారు.

భూలోక కైలాస వాసా..



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం రాత్రి పౌర్ణమి ఊంజల్ సేవ నేత్రపర్వంగా సాగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో శ్రీస్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి అచ్చుతరాయ మండపంపై వేదిపై కొలువుదీర్చి వేదోక్తంగా ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు కనులారా తిలకించి పులకించారు.

వేడుకగా మహా చండీ హోమం



మహా చండీహోమంలో పూర్ణాహుతి చేపడుతున్న ఆలయ అర్చకులు, అధికారులు



తలుపులు మూసివేసిన శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం



తిరుచానూరు శ్రీపద్మావతమ్మ ఆలయం



శ్రీగోవిందరాజస్వామి ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు, అధికారులు

తిరుపతి కల్చరల్: పౌర్ణమి సందర్భంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మహా చండీ హోమం వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హోమ మండపానికి అమ్మవారి ఉత్సవమూర్తిని వేంచేపు చేసి ఉదయం 8.45 గంటలకు అర్చక పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ హోమం చేపట్టారు. ఉదయం 11.45 గంటలకు చేపట్టిన పూర్ణాహుతితో మహా చండీ హోమం ముగిసింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని కొలిచి పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరనలో నైమిశారణ్య పీఠాధిపతి, హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు బాలబ్రహ్మానంద సరస్వతి స్వామి శ్రీదేవి భాగవతం –గంగమ్మతత్వం గురించి ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఆలయ ఈవో కె.మమత, పాలక మండలి సభ్యులు టి.వెంకటేశ్వర్లు, ఎం.హరినాథ్‌రెడ్డి, టి.రమణమ్మ, పి.ధనశేఖర్, వి.క్రిష్ణమ్మ, టి.భారతి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూతపడ్డ గంగమ్మ ఆలయం

చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ తలుపులను మధ్యాహ్నం 2 గంటలకు మూసివేశారు. తిరిగి ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం 9 గంటలకు భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు.

చంద్ర గ్రహణం కారణంగా ఆలయాలు మూసివేత

చంద్రగిరి: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా టీటీడీకి చెందిన పలు ఆలయాలను టీటీడీ అధికారులు మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున 1.05 నుంచి 2.22 గంటల వరకు పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడనుంది. గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయాన్ని టీటీడీ అధికారులు శనివారం సాయంత్రం 5.30 గంటలకు మూసివేశారు. తిరిగి ఆదివారం తెల్లవారుజామున 4.30గంటలకు ఆలయ తలుపులు తెరవనున్నారు. శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని అక్కడి అధికారులు రాత్రి 7గంటలకు మూసివేశారు. ఆదివారం తెల్లవారుజామున తెరవనున్నారు. శ్రీకల్యాణ వెంకన్న ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్‌లు చెంగల్రాయులు, వెంకటస్వామి, మధు, ప్రసాద్, వీఐ రామ్మోహన్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలు మూత

తిరుపతి కల్చరల్: పాక్షిక చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం టీటీడీ స్థానిక ఆలయాల తలుపులు మూసివేశారు. తిరిగి ఆదివారం ఉదయం ఆలయాల తలుపులు తెరుస్తారు. ఈ నెల 29న ఆదివారం వేకువజామున 1.05 నుంచి 2.22 గంటల వరకు పాక్షిక చంద్రగ్రహణం ఉంటుంది. గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయం, శ్రీకోదండరామస్వామి వారి ఆలయం, శనివారం రాత్రి 7 గంటలకు ఆలయ తలుపులు మూసివేశారు. ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. అలాగే శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం 6.45 గంటలకు ఆలయ తలుపులు మూసి వేశారు. ఆదివారం ఉదయం 4 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు.

వైభవంగా ముక్కోటి ఉత్సవాలు





విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: కోరిన కోర్కెలు తీర్చే భోళాశంకరుడికి శనివారం విశేష పూజలు జరిగాయి. తొండవాడలోని స్వర్ణముఖీ నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్తీశ్వరస్వామి(ముక్కోటి) ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి సందర్భంగా ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. ఉదయం అగస్త్యమహాముని‌కి అభిషేకం నిర్వహించారు. తదుపరి స్వామి, అమ్మవార్లకు అభిషేక సేవను నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. తిరిగి సాయంత్రం 3.30 నుంచి 5 గంటల వరకు స్వామి, అమ్మవార్లు నంది వాహనంపై ఆశీనులై ఊరేగారు. ముక్కోటి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని, ఆలయంలో నేతి దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలను చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టుకు చెందిన గాయకుల గానం అలరించింది. భక్తుల రద్దీ దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ రాజశేఖర్, నేతృత్వంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం చంద్రగ్రహణం సందర్భంగా సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని మూసివేశారు.

నేటి కార్యక్రమాలు

రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామి వారికి అభిషేకం, సాయంత్రం దీపారాధన. స్వామి, అమ్మవార్ల కల్యాణం, ఊంజల్ సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సేవలు అభినందనీయం



అంజిని సత్కరిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, పోలీసులు అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అండ్ రెస్టారెంట్స్ నగర అధ్యక్షుడు చిల్లీస్ అంజి కొనియాడారు. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం వేడుకగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన అంజి సమాజ శ్రేయస్సు, ప్రజా రక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలు, పోలీస్ అమర వీరుల గొప్పతనాన్ని గురించి తెలియజేశారు. తిరుపతి జిల్లా ప్రజల రక్షణలో సైనికుల్లా పని చేస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డిని అభినందించారు. జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి అంజిని శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

మంగళంలో నూతన ఎంఆర్ఎఫ్ టైర్స్ సేవా కేంద్రం



సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఆర్ఎఫ్ మేనేజర్లు

తిరుపతి మంగళం: భారతదేశంలో టైర్లు ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న ఎంఆర్ఎఫ్ టైర్స్ తమ నూతన విక్రయ, సేవా కేంద్రాన్ని తిరుపతిలో శనివారం ప్రారంభించింది. ఎంఆర్ఎఫ్ రీజనల్ సేల్స్ మేనేజర్ రెను వర్గీస్, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జగదీశ్వరరావు చేతుల మీదుగా ఈ షోరూమ్ శనివారం ప్రారంభించారు. తిరుపతి–కరకంబాడి మార్గంలోని మంగళం వద్ద «తిరుపతి టైర్ షాపి» పేరుతో అత్యాధునిక సౌకర్యాలతో ప్రారంభించింది. వీల్ అలైన్మెంట్, వీల్ బ్యాలెన్సింగ్, ఆటోమేటిక్ టైర్ ఫిట్మెంట్ తదితర పరిపూర్ణ ఎంఆర్ఎఫ్ సేవలు ఈ కేంద్రం నుంచి పొందవచ్చని షోరూం నిర్వాహకులు లెక్కల నాగరాజు నాయుడు, వి. భాస్కర్ నాయుడు తెలిపారు. వీటితోపాటు అదనంగా ట్యూబ్‌లెస్ టైర్ల రిపేర్, నైట్రోజన్ ఎయిర్ ఫిల్లింగ్ సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన వివరించారు. చెన్నైలోని ఎంఆర్ఎఫ్ టైర్ డ్రామ్ ట్రైనింగ్ కేంద్రంలో ప్రత్యేక శిక్షణ పొందిన టెక్నీషియన్లు వినియోగదారులకు సేవలు అందిస్తారని ఎంఆర్ఎఫ్ ప్రతినిధులు వివరించారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న అలైన్మెంట్, బ్యాలెన్సింగ్ పరికరాలతో వాహనదారులకు ప్రత్యేక అనుభూతి కలిగించేలా సేవలు అందిస్తున్నట్లు వారు వివరించారు.

రామాయణం మానవాళికి స్ఫూర్తి



వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న నాయకులు

రామచంద్రాపురం: వాల్మీకి మహర్షి రచించిన రామాయణం సర్వ మానవాళికి స్ఫూర్తిదాయకమని వైఎస్ఆర్ సీపీ నాయకులు భానుకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సీరామాపురంలోని విరూపాక్షమ్మ ఆలయ ఆవరణలో శ్రీవాల్మీకి బోయ సేవా సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. నాయకులు భానుకుమార్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అన్నదానం చేపట్టారు. శ్రీవాల్మీకి బోయ సేవా సంఘం అధ్యక్షుడు శోభన్‌బాబు, ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప, కార్యదర్శి షణ్ముగం, కోశాధికారి బాలాజీ, సభ్యులు బాలయ్య, నాగరాజు, శంకర్, కృష్ణయ్య, సరళ, గుర్రమ్మ, బుజ్జమ్మ, అజయ్ పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుపతి గాంధీ రోడ్డు: మహాకవి వాల్మీకి మహర్షికి బీజేపీ నాయకులు శనివారం ఘన నివాళులర్పించారు. స్విమ్స్ సర్కిల్లో ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామాయణంతో ప్రపంచానికి గొప్ప కావ్యాన్ని అందించిన కవి వాల్మీకి మహర్షి అని కొనియాడారు. నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు గోపాల్, బాలయ్య, పాపయ్య, కాటమరాజు, ధర్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

శ్రీకపిలేశ్వరునికి అన్నాభిషేకం



అన్నలింగాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు, అధికారులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం అన్నాభిషేకం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ఏకాంతంగా శుద్ధోదక అభిషేకం, ఏకాంతంగా అన్నాభిషేకం, దీపారాధన చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్న లింగ దర్శనం కల్పించారు. తర్వాత ఏకాంతంగా అన్న లింగ ఉద్వాసన చేపట్టి భక్తులకు పంపిణీ చేశారు. శుద్ధి అనంతరం సాయంత్రం సుగంధద్రవ్య అభిషేకం ఏకాంతంగా నిర్వహించారు. పాక్షిక చంద్రగ్రహణం కారణంగా సాయంత్రం 6.45 గంటలకు ఆలయ తలుపులు మూసి వేసి, ఆదివారం ఉదయం 4 గంటలకు ఆలయ తలుపులు తెరుస్తారు. ఆలయం శుద్ధి అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఖాదీ మహోత్సవ్ వ్యాస రచన పోటీలు



విద్యార్థిని ఖాదీ వస్త్రంతో సత్కరిస్తున్న డీవైఈఓ ఆనంద రెడ్డి తదితరులు

తిరుచానూరు(చంద్రగిరి): ఖాదీ మహోత్సవ్ పేరిట శనివారం తిరుచానూరు ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 10.30 గంటలకు ఎం.మురళి, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీఓ గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఎంపికై ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయి విద్యార్థినీ, విద్యార్థులను డీవైఈఓ ఆనంద్ రెడ్డి ఖాదీ వస్త్రంతో సన్మానించి అభినందించారు. ఏపీఓ రామచంద్రారెడ్డి, ఏఎస్ఓ రుక్మాంగద, అసిస్టెంట్ ఏఎంఓ మధు, ఉపాధ్యాయులు వెంకటముని, విజయరాజు, వాసుకి, లక్ష్మీ, భాగ్యశేఖర్ రెడ్డి, వెంకటరమణబాబు, తేజోవతి, సుకన్య, షాజహాన్, సంపూర్ణమ్మ, షంషేర్ ఖాన్ వ్యవహరించారు.

ఆరోగ్య సురక్ష ప్రజలందరికీ రక్ష



వృద్ధురాలికి కంటి అద్దాల పంపిణీ

చంద్రగిరి: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ప్రజల ఆరోగ్యానికి సంపూర్ణ రక్షగా నిలుస్తున్నాయని తొండవాడ సర్పంచ్ మల్లం దీపిక రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని తొండవాడ పంచాయతీలో చివరి రోజు ప్రజలకు ఆరోగ్య సురక్ష క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రమేష్‌బాబు, మాజీ సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి క్యాంపును పరిశీలించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వృద్ధులు, మహిళలకు వారు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిరంజన్, ఈఓపీఆర్డీ శశిరేఖ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగమణి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



మెమెంటో అందజేస్తున్న వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి తదితరులు

తిరుపతి సిటీ: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్ కాలేజ్ గేట్ టోర్నమెంట్ జరుగుతోంది. ఇందులో భాగంగా శనివారం బాస్కెట్‌బాల్ విభాగంలో విజేతలకు బహుమతులు, ప్రతిభా పత్రాలను వీసీ చేతుల మీదుగా అందజేశారు. ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల, చిత్తూరు విజయన్ డిగ్రీకళాశాల మధ్య బాస్కెట్ బాల్ ఫైనల్స్ హోరాహోరీగా సాగింది. ఇందులో విన్నర్‌గా చిత్తూరు విజయన్ డిగ్రీ కళాశాల నిలిచింది. ఆతిథ్య జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మహమ్మద్ హుస్సేన్, షార్ ఫర్మర్ సైంటిస్ట్ కేఎం రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

30న చలో కార్పొరేషన్ కార్యాలయం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీధి వ్యాపారుల సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: కమిషనర్‌ను కలుద్దాం... వ్యాపారుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుదాం అనే నినాదంతో ఈనెల 30వ తేదీ సోమవారం నిర్వహించే చలో కార్పొరేషన్ కార్యాలయం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ మేరకు బైరాగిపట్టెడ పద్మావతి పార్కు కూడలిలో శనివారం వారు వీధి వ్యాపారులతో కలిసి చలో కార్పొరేషన్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30వ తేదీ వీధి వ్యాపారస్తులు సామూహిక విజ్ఞాపన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.మహేంద్ర, వీధి వ్యాపారుల సంఘం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, సుధాకర్, సరిత, విజయ్, రామ్మూర్తి, పెంచలమ్మ, కాంచనమ్మ, రమణ, అహ్మద్ బాషా పాల్గొన్నారు.